సాక్షి వరంగల్

శుక్రవారం | 6 | సెప్టెంబర్ | 2024



## పాకాల పరవళ్లు

భారీగా కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు పూర్తిస్థాయిలో నిండింది. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో ఒకటిన్నర ఫీట్లతో ప్రస్తుతం మత్తడి పోస్తోంది. దీంతో పలు ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు మత్తడి, పాకాల సరస్సు అందాలను వీక్షిస్తూ సంతోషంగా గడుపుతున్నారు. - ఖానాపురం

## న్యూస్‌రీల్

### టీబీ నియంత్రణకు త్వరలో వ్యాక్సిన్



గీసుకొండ: టీబీ నిర్మూలనకు త్వరలో బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని, వ్యాధి గ్రస్తులను గుర్తించే సర్వేను త్వరగా పూర్తిచేయాలని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌సింగ్ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో టీబీ నిర్మూలనపై గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతీఒక్కరికి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు ఉచిత చికిత్స అందిస్తోందని తెలిపారు. ప్రతీ పీహెచ్‌సీలో టీబీ సూపర్‌వైజర్‌కు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కోఆర్డినేటర్ సురేశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### రాయపర్తిలో చోరీ

రాయపర్తి: మండల కేంద్రంలో గురువారం దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ చేశారు. మొరుపోజు రవి ఇంట్లో రెండు బీరువాలు పగులగొట్టారు. నగదు, నగలు దొరకకపోవడంతో వాటిలోని వస్తువులను చెల్లాచెదురుగా పడవేసి వెళ్లారు. అనంతరం దాసరి రాంబాబు ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి రూ.50 వేల నగదు, అర్ధతులం కమ్మలుబుట్టాలను చోరీ చేసి పరారైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

### నిట్‌లో ఘనంగా టీచర్స్ డే



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో గురువారం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యాబోధన చేపట్టాలన్నారు. నిట్‌లో 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 12 మంది అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

### టీజీ ఐసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో గురువారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్ అయిన ఈ కళాశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, హెల్ప్‌లైన్ సెంటర్ కోకన్వీనర్ డాక్టర్ అంజన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### నేడు ఉపన్యాస పోటీలు

విద్యారణ్యపురి: కాళోజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 6న (శుక్రవారం) జిల్లా స్థాయిలో ఆరో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (లష్కర్ బజార్)లో ఈపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 4న జిల్లాలో పాఠశాలల స్థాయిలో కాళోజీ జీవితం–సాహిత్యం అంశంపై పాఠశాల స్థాయిలో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ఈనెల 6న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చూడాలని హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు సంబంధిత గైడ్ టీచర్లతో సహా ఉదయం 9 గంటలకు చేరుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈపోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.1,500, ద్వితీయ బహుమతి రూ.1,000, తృతీయ బహుమతి రూ.500 చొప్పున నగదు అందజేయనున్నట్లు తెలిపారు. వరంగల్ కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం ఉపాధ్యాయుడు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి (98498 34110)ని సంప్రదించాలని డీఈఓ వాసంతి సూచించారు.

## డీఎంఓలుగా సురేఖ, అనురాధ

వరంగల్: వరంగల్ జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, హనుమకొండ జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖను పరస్పర బదిలీ (వర్కింగ్ అరేంజ్‌మెంట్) చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు గురువారం తెలిసింది. వరంగల్ డీఎంఓగా బదిలీపై వచ్చిన అనురాధ జాయిన్ అయిన వెంటనే సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో హనుమకొండ డీఎంఓ సురేఖకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీలపై నిషేధం ఉన్నందున ప్రభుత్వం పరిపాలన సౌలభ్యంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా మార్కెటింగ్ అధికారుల స్థానాల్లో మార్పులు చేసినట్లు సమాచారం. అందులో భాగంగా వరంగల్, హనుమకొండ డీఎంఓలు మారినట్లు తెలిసింది.

# ఆరోగ్య మహిళకు ఆదరణ

**మహిళా క్లినిక్‌లలో మెరుగైన వైద్యసేవలు**

- ఇప్పటి వరకు 20,657 మందికి పరీక్షలు
- జిల్లా ఆస్పత్రులకు 404 మంది రెఫర్



చెన్నారావుపేట ఆరోగ్య మహిళా క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట: పేద మహిళలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్‌లకు విశేష స్పందన వస్తోంది. గత ప్రభుత్వం 2023 మార్చి 8న వీటిని ప్రారంభించింది. జిల్లాలోని చెన్నారావుపేట, పర్వతగిరి, ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రంగశాయిపేట, కీర్తినగర్‌లోని బస్తీ దవాఖానల్లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 20,657 మంది రిజిస్ట్రేషన్ చేయించుకుని పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో పలు వ్యాధులకు సంబంధించిన లక్షణాలు ఉన్న 404 మందిని గుర్తించి వరంగల్‌లోని ఎంజీఎం, హైదరాబాద్‌లోని నిమ్స్, ఎంఎన్‌జే ఆస్పత్రులకు రెఫర్ చేసి ఉచిత వైద్యం అందిస్తున్నారు.

**ప్రతి మంగళవారం వైద్య పరీక్షలు..**

జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య క్లినిక్‌లకు మహిళలు, యువతులు ప్రతి మంగళవారం వస్తున్నారు. థైరాయిడ్, గర్భాశయం, మెనోపాజ్, మూత్ర సంబంధ వ్యాధులు, కడుపులో నీటి బుడగలు, ఫంగస్ ఇన్ఫెక్షన్‌తోపాటు నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్‌తో బాధపడే వారికి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు చేస్తున్నారు.

**ప్రాథమిక దశలో గుర్తిస్తేనే నయం..**

మహిళలు ఆరోగ్య సమస్యలతోపాటు పలు రకాల కేన్సర్ల బారిన పడుతున్నారు. వ్యాధి తీవ్రమైన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ప్రాథమిక దశలోనే పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చు. ఈ ఆరోగ్య మహిళా క్లినిక్‌లు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మరికొన్ని క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

**కేన్సర్ లక్షణాల గుర్తింపు..**

వైద్య పరీక్షలు చేయించుకున్న మహిళల్లో కొంత మందికి కేన్సర్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. 23 మంది నోటి (ఓరల్) కేన్సర్, 26 మంది బ్రెస్ట్ కేన్సర్, 17 మంది సర్వైకల్ కేన్సర్, మమోగ్రాం పరీక్షల ద్వారా 251 బాధితులను గుర్తించి జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

**ఉచిత వైద్యం, మందులు**



మహిళా ఆరోగ్య క్లినిక్‌ల్లో ప్రతి మంగళవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నాం. మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం. అవసరమైతే హైదరాబాద్‌లోని నిమ్స్, ఎంఎన్‌జే ఆస్పత్రులకు తరలించి వైద్యం అందిస్తున్నాం. అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గోక లత, ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్ డీఈఓ

**తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి**



మహిళలు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తాం. ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందిస్తే పూర్తిగా వ్యాధిని నయం చేసుకోవచ్చు.మంచి ఆహారం తీసకోవాలి. మహిళలు, యువతులు ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ఉపయోగించుకోవాలి.

– మట్ట సింధూర, గైనకాలజిస్ట్

## నందిగామలో తీజ్ వేడుకలు



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజనులు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి: మండలంలోని నందిగామలో తీజ్ పండుగను గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొలకెత్తిన గోధుమనారు బుట్టలను గిరిజన మహిళలకు అందించి ఊరేగింపు ప్రారంభించారు. యువతీయువకుల కేరింతల నడుమ ఎమ్మెల్యే నృత్యాలు చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. చెరువులో గోధుమ బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ ఉత్సవాలు ప్రతీక అని పేర్కొన్నారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ నర్సంపేట అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్, జిల్లా నాయకులు ఎర్రబెల్లి రఘుపతిరావు, తేజావత్ సమ్మయ్యనాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేశ్, ప్రధాన కార్యదర్శి డ్యాగల కృష్ణ, నందిగామ, రేలకుంట, నల్లబెల్లి గ్రామ అధ్యక్షుడు జంగిలి మోహన్, రమేశ్, బత్తిని మహేశ్, వర్దం ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

## చేపల చెరువు అక్రమాలపై విచారణ

- కేవీకేలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు

సాక్షి, వరంగల్: చేపల పెంపకం కోసం నీటి నిల్వ ఉండేందుకు తవ్విన చెరువులోని మట్టిని అక్రమంగా అమ్ముకుని రూ.లక్షలు కాజేశారన్న ఆరోపణలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు గురువారం విచారణ చేపట్టారు. చీఫ్ సెక్రెటరీ ఆదేశాల మేరకు మామునూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో అక్రమాలపై లోతుగా ఆరా తీసినట్టు తెలిసింది. అధికారులతో మాట్లాడి అప్పటి ఫైళ్లను పరిశీ లించారని సమాచారం. 2018లో చేపల చెరు వు కోసం తవ్విన మట్టిని అక్రమంగా రూ.80 లక్షలకు అమ్ముకున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పాత అక్రమాలను మళ్లీ విచారిస్తున్నట్టు తెలిసింది. అయితే ఈ వ్యవహారంలో అప్పటి ఓ అధికారి పాత్ర ఉందని వారు అంచనాకు వచ్చి.. మరింత లోతుగా విచారిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో అప్పట్లో ఇక్కడ పనిచేసిన అధికారుల చుట్టూ ఉచ్చు బిగుస్తుందనే ఆందోళన నెలకొంది.

## జిల్లా ఆస్పత్రి పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ సత్యశారద



నర్సంపేట రూరల్ : జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట రూరల్ : జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల పనులను పూర్తిచేసి, ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. నర్సంపేట పట్టణంలో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల భవనాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రి ఆవరణలోని మెట్ల వద్ద కురువకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గదులను, బెడ్లు పరిశీలించారు. బ్లాక్-ఏ, బ్లాక్-సీ పనులను పూర్తయ్యాయని, బ్లాక్-బీలో పనులు త్వరగా పూర్తిచేయాలని, ఆస్పత్రిలో మొక్కలు నాటించాలని ఆదేశించారు. మహిళాశక్తి క్యాంటీన్ వివరాలను అడిగి తెలుసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, సూపరింటెండెంట్ కిషన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్, ఈఈ, డీఈ, హార్టికల్చర్ అధికారి జ్యోతి, మున్సిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

**మోడల్ కేంద్రంగా హర్జ్యాతండా అంగన్‌వాడీ సెంటర్**

గీసుకొండ: మండలంలోని హర్జ్యాతండా అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రీప్రైమరీ విద్య కోసం జిల్లాలో మోడల్ కేంద్రంగా ఎంపిక చేశామని కలెక్టర్ సత్యశారద తెలిపారు. గురువారం కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెల 9న సీఎం రేవంత్ రెడ్డి తన పర్యటనలో భాగంగా విద్యాబోధన కార్యక్రమాన్ని హర్జ్యాతండా నుంచే ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా శిశు సంక్షేమశాఖ స్టేట్ జాయింట్ డైరెక్టర్ అంకేశ్వర్‌రావు,పోషణ్ అభియాన్ స్టేట్ కన్సల్టెంట్ శివాల్కర్,జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ కార్తీక్, తహసీల్దార్ రియాజుద్దీన్, సీడీపీఓలు విశ్వజ, డెబోరా, ఎంపీడీఓ కమలాకర్, ఆర్ఐ సాంబయ్య,అంగన్‌వాడీ టీచర్ సరోజ పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ



నర్సంపేట రూరల్ : బానోజీపేట సబ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

నర్సంపేట రూరల్: వైద్య సిబ్బంది ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. నర్సంపేట మండలంలోని భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భానోజీపేట సబ్‌సెంటర్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడారు. డెంగీ వచ్చిన వారి ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతిరోజు గర్భిణులను పర్యవేక్షించి, ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని ఆదేశించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను కూడా పూర్తి చేయాలన్నారు. భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌చంద్ర, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

**విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు**

దుగ్గొండి: విధుల్లో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నాచినపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.సమయానికి రాని సిబ్బందికి గైర్హాజరు వేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జ్వరాలు విజృంభిస్తున్నందున ప్రతి ఇంటి ఆరోగ్య వివరాలు ఆశకార్యకర్తల వద్ద ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్‌రాజు, హుస్సేన్, సిబ్బంది సాంబయ్య, గొడిశాల భాస్కర్, చాణక్య, సలోమి, సబిత, రహమాన్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సుధీర్‌కుమార్



హన్మకొండ కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును హనుమకొండ విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ నట్లొడ సుధీర్‌కుమార్ అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన గురుపూజోత్సవంలో సుధీర్‌కుమార్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

**గురువులే నవ సమాజ నిర్మాతలు**

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఉర్సుగుట్టలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉత్తములకు పురస్కారాలు ప్రదానం చేసిన అతిథులు
- హాజరైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే నాగరాజు

ఖిలా వరంగల్: గురువులే నవ సమాజ నిర్మాతలని, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయులేదనని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. వరంగల్ ఉర్సుగుట్టలోని ఆకుతోట కన్వెన్షన్‌హాల్‌లో కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ పల్లం పద్మతో కలిసి ఎంపీ కావ్య.. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి చదువుపై దృష్టిసారించేలా చూడాలని, వారిని అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యార్థుల భవితకు బాటలు వేయాలని పేర్కొన్నారు. తనకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను నేటికీ స్మరించుకుంటానని ఆమె గుర్తు చేశారు.

**ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. ఒకే వేదికపై ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఉన్నా సమాజంలో గొప్ప వ్యక్తి ఉపాధ్యాయుడేనని గుర్తుచేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిసారి ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు.

**విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

తరగతి గదిలో విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి శాసన సభలో 317 జీఓపై మాట్లాడినట్లు గుర్తుచేశారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను నిర్మూలించాలని సూచించారు.

**విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఎదురవుతున్న కొన్ని ఇబ్బందులను అధిగమించేందుకు యంత్రాంగం మరింత కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. అనంతరం 59 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయినీఉపాధ్యాయులకు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలు అందించారు. అంతకు ముందు పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థినీవిద్యార్థులకు అతిథులు ప్రశంసపత్రాలను అందజేసి అభినందించారు. వేడుకల్లో జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



పిరమిడ్ ఆకారంలో వంచనగిరి కేజీబీవీ విద్యార్థినులు

## యథావిధిగా రైళ్ల రాకపోకలు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను గురువారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇంటికన్నె–తాళ్లపూసపల్లి రైల్వే ట్రాక్ ఘటనతో నాలుగు రోజుల పాటు పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈమేరకు రైల్వే అధికారులు ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి ట్రైన్స్‌ను రిస్టోరేషన్ చేసి యథావిధిగా నడిచేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పలు రైళ్లు నిర్ణీత సమయాని కన్నా ఆలస్యంగా నడుస్తున్నాయి.

## విద్యార్థినులకు ఇబ్బందులు కలిగించొద్దు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

రాయపర్తి: విద్యార్థినులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ సంధ్యారాణి హెచ్చరించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గదులు, స్టాక్‌రూం, వంటలను పరిశీలించారు. విద్యాబోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వసతిగృహాలను మరింత బలోపేతం చేస్తోందని తెలిపారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కిషన్‌నాయక్, ప్రిన్సిపాల్ సరిత ఉన్నారు.

## క్లుప్తంగా

### అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో మల్సూర్ ప్రతిభ


పతకం అందుకుంటున్న మల్సూర్

డోర్నకల్: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ పోటీల్లో డోర్నకల్ మండలం చాప్లాతండాకు చెందిన క్రీడాకారుడు ప్రతిభ కనబర్చాడు. తండాకు చెందిన ధారావత్ మల్సూర్ నేపాల్‌లోని పోఖ్రాలో ఈ నెల 1వ తేదీన ఇంటర్నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఫైనల్‌లో నేపాల్.. ఇండియా జట్టుపై విజయం సాధించడంతో ఇండియా సిల్వర్ పతకం పొందింది. ఫైనల్‌లో మల్సూర్ జట్టు 15 పాయింట్లు సాధించడంతో బెస్ట్ ఆల్‌రౌండర్ పతకం అందుకున్నాడు. ఈ సందర్భంగా మల్సూర్‌ను స్థానికులు అభినందించారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు కేసు వచ్చే నెల 17కు వాయిదా

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టులో అవినీతిపై భూపాలపల్లికి చెందిన వ్యక్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కోర్టుకు గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డి, అధికారులు సబర్వాల్, రజత్‌కుమార్, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధుల తరఫున న్యాయవాదులు నరసింహారెడ్డి, ఆదానీ హాజరయ్యారు. జడ్జి నారాయణబాబు కేసును వచ్చే అక్టోబర్ 17వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది.

### తన వాటా ఇప్పించాలని తహసీల్ ఎదుట నిరసన

● మందు డబ్బాతో బాధితుల ఆందోళన


తహసీల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలు యశోద

జనగామ రూరల్: తన భర్త తేజావత్ శ్రీనివాస్ వాటా తమకు ఇప్పించాలని జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్ జీపీ పరిధి పెద్దతండా (వై)కి చెందిన యశోద తన ముగ్గురు పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసనకు దిగింది. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి యత్నించగా తహసీల్ సిబ్బంది మందుడబ్బా లాక్కుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితురాలు యశోద కథనం ప్రకారం.. తండాలోని 85/ఎ/1 సర్వే నంబర్‌లో 14 ఎకరాల భూమి ఉండగా.. వారసత్వ వాటాగా 3 ఎకరాలు రావాల్సి ఉండగా.. తన భర్త అన్నదమ్ములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. తనకు ఇద్దరు ఆడపిల్ల లు ఉన్నారని, భూమి ఇప్పించకుంటే కుటుంబంతో సహా ఎమ్మార్వో కార్యాలయం వద్ద పురుగుల మందు తాగి చావడం తప్ప వేరే దారి లేదని పేర్కొంది. కాగా, విషయంపై తహసీల్దార్ వెంకన్నను వివరణ కోరగా బాధితురాలి పేరుతో భూమి లేదు.. గతంలో ఈ విషయంపై వివరించాం.. చట్టం ప్రకారం ఎవరి పేరుతో భూమి ఉంటే వారు చె ప్పిన వారికి స్లాట్ బుక్ చేసుకుంటే పట్టా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.



### మట్టి వినాయకుడే శ్రేయస్కరం



వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల విషయంలో పూర్తిగా భక్తి శ్రద్ధలు ఉండాలి. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో చేసిన ప్రతిమలనే ప్రతిష్ఠించి నవరాత్రులు పూజించడం శ్రేయస్కరం. మండపాలపై అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి.

-గంగు ఉపేంద్రశర్మ, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు, హనుమకొండ

### పర్యావరణాన్ని కాపాడుదాం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో పాటు వినాయక ప్రతిమల కోసం వినియోగించే కెమికల్ రంగులతో పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. ప్రకృతికి తీవ్ర హాని కలుగుతుంది. ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలి. మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుందాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.

- న్యాలకొండ భాస్కర్‌రావు, కన్వీనర్, వరంగల్ మహానగర్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి

### ఇదే నా జీవనాధారం



వినాయక విగ్రహాల తయారీ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వినాయక చవితి సమయాల్లో మాత్రమే తెలంగాణ వైపు వస్తాం. ఆ తర్వాత కోల్‌కతా వెళ్లిపోతాం. దసరా ఉత్సవాలకు సంబంధించి అక్కడ దుర్గాదేవీ విగ్రహాలు తయారు చేస్తాం.

- చందన్, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

### మట్టి విగ్రహాలే శ్రేష్ఠం



20 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నా. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసే విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తుంది. ప్రతి ఒక్కరూ మట్టితో చేసే విగ్రహాలను పూజించాలి. వినాయక చవితి సమయంలో ఇలా ఉపాధి దొరుకుతుంది. మిగతా రోజుల్లో కోల్‌కతాకు వెళ్లి పనులు చేసుకుంటాం.

-భీష్మ, కోల్‌కతా, విగ్రహాల తయారీదారుడు

# మట్టి గణపతికే జై..

మట్టి వినాయకులనే పూజిద్దాం
- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- మొదలైన నవరాత్రోత్సవాల సందడి
- విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయక విగ్రహాలు


కాజీపేటలో మట్టితో వినాయక విగ్రహం తయారు చేస్తున్న కళాకారుడు

హన్మకొండ కల్చరల్: ఊరూ.. వాడ సందడిగా నిర్వహించే వినాయక చవితి సమీపిస్తోంది. ఉత్సవాలు ఈనెల 7న ప్రారంభం కానున్నాయి. ఇక ఒక రోజు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే మండపాలను సిద్ధం చేసేపనిలో నిమగ్నమయ్యారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ (పీఓపీ) విగ్రహాలను దూరంగా ఉంచి ఆదర్శంగా నిలవాల్సిన తరుణమిదే. పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను పూజించేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ దిశగా గ్రామాల నుంచి నగరం వరకు అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**పనులకు ఆటంకం కలగొద్దని పూజలు..**

చేపట్టిన పనులు ఎలాంటి ఆటంకాలు, అడ్డంకులు రాకుండా నిర్విఘ్నంగా జరగాలని గణనాథుడిని పూజిస్తారు. గణనాయకుడు జన్మించింది పార్వతీదేవి మేనినలుగు మట్టి నుంచేనని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే మట్టి వినాయకుడిని పూజిస్తే చేపట్టే కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగి ముక్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ప్రకృతి ప్రేమికులు సైతం వినాయకుడిని పూజిస్తే ప్రకృతిని ప్రేమించినట్లేనని చెబుతారు.

**రంగులతో అనర్థం..**

విగ్రహాల తయారీకి వినియోగించే రంగులు అనారోగ్యానికి అత్యంత హానికరం. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే సందర్భంగా నీటిలో ఈ రంగులు కలిసిపోవడం వల్ల నీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు ఏర్పాటు చేయడంతో వెలువడే విషవాయువుల వల్ల వాతావరణం కలుషితమై మానవాళికి ముప్పు ఏర్పడుతుంది.

**మట్టి వినాయకుడితో ఉపయోగాలు ..**

మట్టి వినాయకుడిని పూజించడం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. ప్రకృతిని పూజించే అవకాశం కలుగుతుంది. నిమజ్జనం సందర్భంగా మట్టి నీటిలో సులభంగా కరుగుతుంది. నీటిలోని జీవరాసులకు ఎలాంటి హాని కలగదు. అదేవిధంగా నీరు కూడా కలుషితం కాదు.

**మూడేళ్లుగా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠిస్తున్నాం..**



ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కలిగే అనర్థం ప్రజలకు ఇప్పటికే అర్థమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తుండడం బాగానే ఉన్నా.. ఎంత మంది మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజిస్తున్నారనే విషయం ముఖ్యం. మూడేళ్లుగా మా కాలనీలో మట్టి గణనాథుడినే ప్రతిష్ఠిస్తున్నాం.

-అరూరి సాంబయ్య, విష్ణుపురి కాలనీ, కాజీపేట

### మట్టి వినాయకులను పూజిద్దాం

● వరంగల్ ఎంపీ కావ్య


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ కావ్య, తదితరులు

హన్మకొండ చౌరస్తా: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిద్దామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యాన రూపొందించిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ, వాల్ పోస్టర్లను హనుమకొండలోని నివాసంలో గురువారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ రసాయన రంగులు అద్దిన విగ్రహాల ద్వారా నీరు కలుషితం అవుతుందని, తద్వారా అందులోని జలచరాలు మృత్యువాత పడతాయని చెప్పారు. పండుగలను ప్రకృతి హితంగా జరుపుకుంటూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొల్ల శరత్‌చంద్రారెడ్డి, జాతీయ కార్యదర్శి సీహెచ్.సాగర్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజు, అరవింద్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణ
- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన


ఆధారాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్స్ బృంద సభ్యుడు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో 12 తులాల బంగారు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2 లక్షల నగదు అపహరణకుగురికాగా ఈ విషయం గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు కాసోజు బ్రహ్మాచారి కథనం ప్రకారం.. పౌరోహిత్యం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న కాసోజు బ్రహ్మాచారి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర మిల్ తండ సమీపంలో నివసిస్తున్నాడు. ఆయన భార్య అశ్విని గర్భిణి కాగా ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో గత నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన వారి బంధువు.. బ్రహ్మాచారి ఇంటి ముందు నుంచి వెళ్తూ ఇంటి తలుపులు తెరచి ఉండడాన్ని గమనించి బ్రహ్మాచారికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు హుటాహుటిన ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫింగర్ ప్రింట్స్ బృందం ఘటన స్థలంలో ఆధారాలు సేకరించింది. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ప్రకృతి సేద్యంతోనే మానవ మనుగడ

● త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి


మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కేసముద్రం: ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో అభినవ్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా అభినవ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం అవసరమని, ఆర్గానిక్ పంటల సాగు ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో దృఢంగా ఉంటారన్నారు. ప్రధానమంత్రి మోదీ సులభతరమైన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు డ్రోన్ పథకం ద్వారా డ్రోన్, ఇతర పరికరాలను సబ్సిడీపై ఇస్తున్నట్లు పేర్కొన్నారు. త్రిపురతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఆర్గానిక్ పంటలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని, ప్రధాని చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ఆర్గానిక్‌తో కూడిన వంటకాలనే భోజనంగా అందిస్తారని తెలిపారు. అనంతరం డ్రోన్‌లను పరిశీలించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు తప్పకుండా మార్కెట్లో ధర లభించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రముఖ ప్రకృతి సాగు శిక్షకుడు విజయరాం మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగంతో పండించే పంటలను తినడం వల్ల ఎసిడిటీ వస్తుందని చెప్పారు. తాము 15 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని, ఆ పంటనే తిరుపతిలో శ్రీవేంకటేశ్వరస్వామి వద్ద నైవేద్యం సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు భూతాపాన్ని తగ్గించేలా వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ముందు త్రిపుర గవర్నర్‌కు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం చేశారు. సాల్లేటి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, డీపీఓ విజయనిర్మల, ఆర్డీఓ అలివేలు, డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దార్ దామోదర్, ఏఓ వెంకన్న, శాస్త్రవేత్త క్రాంతికుమార్, సంకు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఏసోబు అంత్యక్రియలు

- నివాళులర్పించిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు, స్థానికులు
- ఎరుపెక్కిన టేకులగూడెం గ్రామం


టేకులగూడెంలో ఏసోబు అంతిమయాత్ర


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మడికొండ: ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర మిలిటరీ ఇన్‌చార్జ్ మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ దాదా రణదేవ్ అంత్యక్రియలు గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. కుటుంబ సభ్యులు ఏసోబు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉదయం 9 గంటల సమయంలో గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎర్ర జెండాలు రెపరెపలు, విప్లవ గేయాల మధ్య అంతిమయాత్ర సాగింది. తరలివచ్చిన మాజీ మావోయిస్టులు, రాజకీయ నాయకులు నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీప శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మాచర్ల ఏసోబుకు విప్లవ జోహార్లు అంటూ.. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు భారతక్క, గాదె ఇన్నయ్య, గాజర్ల అశోక్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర సీడ్ ఆయిల్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్లు, బంధుమిత్రుల సంఘం సభ్యులు, స్థానిక నాయకులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## కల్లెడ ఆణిముత్యం దీప్తి..

- పారాలింపిక్స్‌లో పతకం తేవడంతో అంతర్జాతీయంగా పేరు
- ఊరే గెలిచినట్టుగా సంబరాలు.. తల్లిదండ్రుల్లో ఆనందం
- వైకల్యం ఉన్నా పట్టుదలలో కనిపించని లోపం


ఊరిలో ఏర్పాటు చేసిన బ్యానర్

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామం.. ఇప్పుడు ఈ పేరు అంతర్జాతీయ యవనికపై మార్మోగుతోంది. ఎందుకంటే పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో ఈ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి కాంస్య పతకం సాధించడమే. ట్విట్లర్లు, ఇన్‌స్టాగామ్ వేదికగా ఆమె విజయాన్ని అందరూ స్మరిస్తుంటే.. గ్రామస్తులు మాత్రం ఆమె పతకం అందుకునేందుకు పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ కీర్తిస్తున్నారు. దీప్తితో చదివిన స్నేహితులు, గ్రామ ప్రజలతోపాటు తల్లిదండ్రులు సంబరపడుతున్నారు. దివ్యాంగురాలైన దీప్తి జీవితం ఎలా ఉంటుందని అనుకున్న గ్రామస్తులు.. పారిస్‌లో కాంస్య పతకం సాధించడాన్ని చూసి కూతురంటే ఇలా ఉండాలి అని అంటున్నారు. ఆమె గెలిస్తే ఊరే గెలిచినట్టుగా సంబరాలు చేసుకుంటున్నారు.

**ఊరే గెలిచినట్టుంది..**



మా కూతురిని చూసి చాలా మంది ఎలా ఉంటుందోనని అంటుండేవారు. ఆ సమయంలో నాకు కూడా చాలా ఇబ్బందిగా అనిపించేది. రన్నింగ్‌లో చిరుతలా పరుగులు తీస్తూ పతకాలు తెస్తుంటే మా ఆనందానికి అవధులు లేవు. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో మహిళల 400 మీటర్ల టీ20 కేటగిరీ ఫైనల్లో మూడో స్థానంలో కాంస్య పతకం తీసుకురావడంతో నా జన్మకు ఇక ఇది చాలు అనిపించింది. మా గ్రామమే గెలిచినట్టుగా సంబరాలు చేసుకోవడం చూస్తుంటే మాటలు రావడం లేదు. వైకల్యాన్ని అధిగమించి దేశమే గర్వపడే విధంగా నిలిచిన దీప్తికి ప్రభుత్వం ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలి. ఆమెను ప్రోత్సహిస్తే ప్రపంచ స్థాయిలో మరిన్ని పతకాలు భారత్‌కు రావడం ఖాయం.

-యాదగిరి, దీప్తి తండ్రి

**పారిస్‌లో పరుగులు..**



చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే దీప్తి ఆసక్తి చూపేది. స్నేహితురాళ్లతో కలిసి గ్రామంలో పరుగులు తీసేది. వైకల్యం ఉన్నా తనలో కనిపించకుండా జాగ్రత్త పడుతూ మనో ధైర్యంతో ముందుకెళ్లింది. పాఠశాలలో నిర్వహించే ఆటల్లో ఎప్పుడూ మొదటి స్థానంలో నిలిచేది. అలా ఆమెలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించాం. ఆ సమయంలో ఉపాధ్యాయులు కూడా ప్రోత్సహించడంతోనే ఇప్పుడూ పతకాలు తీసుకురాగలుగుతోంది. పేదరికం ఉన్నా ఎక్కడ పోటీలకు వెళ్లినా తిరస్కరించలేదు. కల్లెడ నుంచి పారిస్ వరకు నా కూతురు పయనం ఉండడం, చిన్నప్పుడు కల్లెడలో చేసిన పరుగులే...ఇప్పుడూ పారిస్‌లో నాకు కనిపించాయి. కాంస్యం సాధిస్తే దేశమే గెలిచినట్టు ఉంది. ముఖ్యంగా మా ఊరే గెలిచినట్టు సంబరాలు చేసుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతి.

-ధనలక్ష్మి, దీప్తి తల్లి

**కల్లెడకు పేరు తెచ్చింది..**



దీప్తిని నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. కల్లెడలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో కలిసి ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కలిసి చదివాం. ఆ సమయంలోనే వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు జనవరి 26, ఆగస్టు 15 సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించేవారు. ముఖ్యంగా పరుగు పందెంలో దీప్తి మొదటి వరుసలో ఉండేది. బహుమతులు గెలుచుకునేది. పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించేందుకు తీసిన పరుగులు చూస్తుంటే చిన్నతనంలో ఉన్న ఆ కసినే కనిపించింది. నా స్నేహితురాలు దేశం గర్వించే విధంగా రాణించడం ఆనందంగా ఉంది. కల్లెడకు మంచి పేరు తీసుకొచ్చింది. -మల్యాల రమ్య, స్నేహితురాలు

**గ్రామస్తులకే గర్వకారణం..**



దీప్తి ఏది అనుకుంటే అది సాధించడంలో దిట్ట. ఆమెకు వైకల్యం కూడా అడ్డు రాలేదు. పారిస్ పారాలింపిక్స్‌లో పతకం సాధించడం ఆమెకే కాదు ఊరికే గర్వకారణం. చిన్నప్పటి నుంచి కొందరు ఆమెను అవహేళన చేసినా, ఇప్పుడు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రముఖులతో శెభాష్ అనిపించుకోవడం కల్లెడ గ్రామ పేరు ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా చేసింది.

- ముదురుకుల్లా రమేశ్, కల్లెడ

## డెంగీతో యువకుడి మృతి


విజయ్(ఫైల్)

కొత్తగూడ: డెంగీ జ్వరంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లెల విజయ్(35)కి వారం క్రితం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు తెల్ల రక్తకణాలు తగ్గిపోయినట్లు గుర్తించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కాగా, ములుగు మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి.. మల్లెల విజయ్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

### చెరువులో పడి పశువుల కాపరి..


రాజు (ఫైల్)

కాటారం: గేదెలను చెరువు నుంచి బయటకు వెళ్లకొట్టడానికి వెళ్లిన ఓ పశువుల కాపరి కందకంలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ప్రతాపగిరి జీపీ పరిధి మద్రిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నలుబోతుల రాజు(25) పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రాజు ఉదయం గేదెలను మేపడానికి బొప్పారం శివారులోని దేవుని చెరువు వైపునకు వెళ్లాడు. గేదెలు చెరువులోకి వెళ్లడంతో వాటిని బయటకు వెళ్లగొట్టడానికి అందులోకి దిగాడు. చెరువులో పెద్ద కందకాలు ఉండడంతో రాజు లోతు తెలియక అందులో మునిగిపోయి గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి నీటిలో వెతకగా రాజు మృతదేహం లభించింది. కాగా, రాజు భార్య గతేడాది ఆత్మహత్యకు పాల్పడగా తల్లి మల్లక్కతో ఉంటున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

## విధుల్లో అలసత్వం ఉండొద్దు

● ఆర్‌జేడీఎం, పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్


వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఆర్‌జేడీఎం, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి వచ్చిన సందర్భంలో చాంబర్ ప్రతినిధులు, కూరగాయల మార్కెట్ వ్యాపారులు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. డైరెక్టర్ సూచనల మేరకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేడీఎం గురువారం వరంగల్ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అంతర్గత సమావేశంలో మార్కెట్ పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుమాములలోని గ్రేయిన్ మార్కెట్, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లలో అధికారులు, ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును సంబంధిత సూపర్‌వైజర్ రోజూ తీసుకోవాలని ఆదేశించారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయంపై సంబంధిత ఇన్‌చార్జ్‌లు దృష్టి సారించాలన్నారు. మార్కెట్లలో పారిశుద్ధ్య పనులు పొందిన కాంట్రాక్టర్లు మార్కెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త, ముర్రిగిన కూరగాయలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లుల్లో కోత తప్పదని హెచ్చరించారు. లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లోని కమీషన్ వ్యాపారులు, కవర్ షెడ్ వ్యాపారులతో మాట్లాడి అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీఎం పద్మావతి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, గ్రేడ్-2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ఎఎస్‌లు అనిల్, రాజేందర్, అకౌంటెంట్ సుకన్య పాల్గొన్నారు.